

ఆనకట్ట భద్రమేనా?

- సరళా సాగర్ డ్యాం భద్రతపై ఆందోళన
- కుడి కాల్వ కట్ట నుంచి లీకేజీలు
- సైఫన్ల పైభాగంలో పగుళ్ల నుంచి నీరు
- నిర్వహణా లోపంతో గతంలో తెగిన ఎడమ కాల్వ కట్ట



కుడి కాల్వ కట్ట నుంచి లీకవుతున్న నీరు



సరళాసాగర్ ప్రాజెక్టు

మదనాపురం, అక్టోబరు 4: వనపర్తి జిల్లా మదనాపురం మండలం శంకరాయపల్లి గ్రామ సమీపంలోని సరళాసాగర్ డ్యాం భద్రతపై ఆందోళన వ్యక్తం అవుతోంది. ఈ డ్యాం అత్యంత అరుదైనది. సైఫన్ సిస్టమ్‌తో నిర్మించిన ఈ ప్రాజెక్టు ఆసియా ఖండంలో మొదటిది కాగా, ప్రపంచంలోనే రెండవది కావడం విశేషం. ప్రాజెక్టుకు పూర్తి స్థాయిలో నీరు వచ్చినప్పుడు గాలి ఒత్తిడితో సైఫన్లు వాటంతకు అవే తెరచుకొని, నీటిని విడుదల చేస్తాయి. ఇలాంటి అరుదైన ప్రాజెక్టును వనపర్తి సంస్థానాధీశుడు రాజారామేశ్వరరావు హయాంలో, 1949 సంవత్సరంలో నిర్మించారు. ఇంతటి ప్రాధాన్యం ఉన్న ప్రాజెక్టుపై పర్యవేక్షణ కరువైంది. దాంతో తరుచూ సమస్యలు ఎదురవుతున్నాయి.

లీకేజీలతో పొంచి ఉన్న ముప్పు

సైఫన్ల పైభాగంలో ఏర్పడిన పగుళ్లతో ఆనకట్టకు ముప్పు పొంచి ఉందన్న ఆందోళన వ్యక్తం అవుతోంది. నిండుగా నీరొచ్చి, సైఫన్లు తెరుచుకున్నప్పుడు కట్టపై భాగంలో ఏర్పడ్డ పగుళ్ల నుంచి నీరు పైకొస్తోంది. ఇది ఇలాగే వుంటే డ్యాంకు ముప్పు వాటిల్లే ప్రమాదముంది. దీంతో పాటు కుడి కాలువ కట్టకు ఏర్పడిన లీకేజీలతో నీరు కిందకు వస్తోంది. అధికారుల పర్యవేక్షణా లోపంతో 2019, డిసెంబరు 31న ప్రాజెక్టు ఎడమ కాలువ తెగిపోయింది. అయినా కుడి కాలువ కట్టకు ఏర్పడ్డ లీకేజీలను ఎవరూ పట్టించుకోవడం లేదని ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డ్యాం పరిస్థితిపై స్థానికులు ఇరిగేషన్ అధికారులకు సమాచారం అందించడంతో ఇటీవల డ్యాం సేఫ్టీ అధికారులు పరిశీలించారు. నీళ్లు తగ్గిన తర్వాతే మరమ్మతులు చేసేందుకు వీలుంటుందని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సరళాసాగర్ ప్రాజెక్టుకు భద్రత కల్పించాలని కోరుతున్నారు.



సైఫన్ పైభాగంలో ఏర్పడ్డ పగుళ్ల నుంచి బయటికి వస్తున్న నీరు



అరుదైన ప్రాజెక్టును కాపాడాలి

ఆటోమెటిక్ సైఫన్ సిస్టం ఉన్న అరుదైన సరళాసాగర్ ప్రాజెక్టు భద్రతకు చర్యలు తీసుకోవాలి. కుడి కాలువను నిర్మించి, సైఫన్ పై భాగంలో లీకేజీలను సరి చేయాలి. ప్రాజెక్టుపై అధికారుల పర్యవేక్షణ పెంచాలి. ప్రాజెక్టు ముందు పెరిగిన కంప చెట్లను తొలగించాలి. నిర్లక్ష్యం చేస్తే అరుదైన ప్రాజెక్టు కాలగర్భంలో కలిసి పోయే ప్రమాదముంది.

- రంగన్నయాదవ్, రైతు, మదనాపురం



ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్నాం

ప్రాజెక్టుకు ఏర్పడిన పగుళ్లను ఇటీవల డ్యాం సేఫ్టీ అధికారులు పరిశీలించారు. ప్రాజెక్టు పరిశీలనకు త్వరలో మరో బృందం కూడా రానున్నది. డ్యాం మరమ్మతు కోసం ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్నాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభించి, పూర్తి చేస్తాం. డ్యాం రక్షణకు అవసరమైన చర్యలు తీసుకుంటాం.

- రనీల్‌రెడ్డి, ఇరిగేషన్ ఏఈ

కొరడాతో.. పోలీసుల్లో గుబులు

- ఇసుక అక్రమ రవాణాను ప్రోత్సహించిన నలుగురు ఎస్‌ఐలు వీఆర్‌లో..
- రహస్యంగా సమాచారం తెప్పించిన ఐజీ సత్యనారాయణ

నాగర్‌కర్నూల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను ప్రోత్సహిస్తున్న ఎస్‌ఐలపై ఐజీ కొరడా ఝుళిపించారు. జిల్లాలోని వంగూరు, ఉప్పునుంతల, బిజినేపల్లి, తెలకపల్లి ఎస్‌ఐలను వీఆర్‌లో ఉంచుతూ గురువారం రాత్రి ఐజీ సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. వారిలో వంగూరు, ఉప్పునుంతల ఎస్‌ఐలను అక్రమ రవాణా అంశంలో వీఆర్‌లో ఉంచగా, బిజినేపల్లి ఎస్‌ఐకి సంబంధించి ఇటీవల చోటు చేసుకున్న రెండు సంఘటనలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఈ చర్యలు తీసుకున్నట్లు సమాచారం. ఎస్‌బీ, సెంట్రల్ ఇంటలిజెన్స్‌లతో కాకుండా ప్రత్యేకంగా ఒక టీమ్‌ను ఏర్పాటు చేసిన ఐజీ సత్యనారాయణ వారి ద్వారా ప్రతీ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐలు, కానిస్టేబుళ్ల పనితీరుపై నివేదిక తెప్పించుకున్నారని సమాచారం. మరికొందరు కానిస్టేబుళ్లపై కూడా త్వరలో వేటు పడనున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.



దుందుభీ వాగు పరిసర ప్రాంతంలోని వ్యవసాయ పొలంలో డంపు చేసిన ఇసుక(ఫైల్)

అక్రమ రవాణాకు ఆ రెండు మండలాలే కీలకం

జిల్లాలో ఇసుక అక్రమ రవాణాకు ఉప్పునుంతల, వంగూరు మండలాలు కీలకంగా మారాయి. దుందుభీ పరివాహక ప్రాంతం కావడంతో ఉప్పునుంతల మండలంలోని మామిళ్లపల్లి, దాసర్లపల్లి, పెద్దాపూర్, జప్తిసదగోడు, మొల్గర, కంసానిపల్లి, తిర్మలాపూర్, వంగూరు మండలంలోని ఉల్పర, డిండిచింతపల్లిలలో ఇసుక గణనీయంగా లభించడం అక్రమ రవాణాదారులకు వరంగా మారింది. ఇసుక రవాణా కోసం ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశపెట్టినా.. కొందరు అధికారుల చేతివాటం కారణంగా సక్రమంగా అమలు కావడం లేదు. దాంతో ఈ రెండు మండలాల్లో రోజుకు దాదాపు 300 ట్రాక్టర్లల్లో ఇసుక జిల్లా అంతటా అక్రమంగా రవాణా అవుతోంది. దుందుభీ వాగులో ట్రాక్టర్ ఇసుకను లోడ్ చేయడానికి ఎక్స్‌కవేటర్ అయితే రూ. 600, కూలీలు అయితే రూ.వెయ్యి తీసుకుంటున్నారు. డీజిల్ ఖర్చులు, డ్రైవర్ బత్తాకు రూ.1500 ఖర్చవుతుండగా, మొత్తం కలిపి రూ.2,500 అవుతోంది. కానీ దళారులు మాత్రం ట్రిప్పు ఇసుకను రూ.5,500 నుంచి రూ.6,000 వరకు అమ్ముకుంటున్నారు. ఇంత రేటు ఎందుకని ప్రశ్నిస్తే తాము ఇసుక రవాణా చేయాలంటే ఒక్కో స్టేషన్‌లో నెలకు రూ.10 వేలు ఇవ్వాల్సి ఉంటుందని బహిరంగంగా చెబుతున్నారు. ఇందుకోసమే ఉప్పునుంతల, వంగూరు మండలాల్లో పోస్టింగ్ కోసం పోటీ పడే వారి సంఖ్య పెరిగిందని కొందరు వ్యాఖ్యానిస్తుండడం గమనార్హం. ఇసుక రవాణా వ్యవహారం ఆన్‌లైన్ ద్వారా నిర్వహించేలా చర్యలు తీసుకుంటే మైనింగ్ శాఖకు కూడా గణనీయంగా ఆదాయం పెరిగే అవకాశాలు ఉన్నాయి. కానీ ఆఫీసర్లు ఎందుకు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఇటీవల నాగర్‌కర్నూల్ జిల్లా పోలీస్ శాఖలో సస్పెన్షన్ల పర్వం కొనసాగుతుండగా తాజాగా నలుగురు ఎస్‌ఐలను వీఆర్‌లో ఉంచడం చర్చనీయాంశమైంది.



ఉప్పునుంతల మండలం మొల్గర సమీపంలోని దుందుభీ వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలించడానికి వచ్చిన ట్రాక్టర్లు(ఫైల్)

మాజీ నక్సలైట్ పేరుతో బెదిరించిన వ్యక్తి అరెస్టు

- హైదరాబాద్‌లో పట్టుకున్న వనపర్తి పోలీసులు
- రూ.6 వేలు, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి క్రైమ్, అక్టోబరు 4: మాజీ నక్సలైట్ పేరుతో రైస్ మిల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిని బెదిరించిన ఓ వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ తెలిపారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయన వివరాల ప్రకారం.. ఖిల్లాఘణపూర్ మండలం సోలీపూర్ గ్రామానికి చెందిన తేనేటి శేఖర్ రెడ్డికి ఈనెల ఒకటో తేదీన రాత్రి 10 గంటలకు ఓ వ్యక్తి మాజీ నక్సలైట్ పేరుతో ఫోన్ చేశాడు. రూ.50 లక్షలు ఇవ్వాలని, లేకపోతే చంపుతానని బెదిరించాడు. ఈ విషయమై శేఖర్ రెడ్డి రెండో తేదీన ఖిల్లాఘణపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేశారు. రెండో తేదీ ఉదయం తొమ్మిది గంటలకు నిందితుడు శేఖర్ రెడ్డికి మళ్లీ ఫోన్ చేశాడు. అత్యవసరం ఉందని, రూ.8,000 వేయాలని డిమాండ్ చేయగా బోడుప్పల్‌లోని మనీ ట్రాన్స్‌ఫర్ కస్టమర్ సర్వీస్ సెంటర్‌కు డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేశాడు. ఆ తరువాత కూడా శేఖర్ రెడ్డికి మళ్లీ మళ్లీ ఫోన్ చేసి ఇంకా రూ.25 వేలు వేయాలని, లేకపోతే మీ కుటుంబాన్ని చంపేస్తానని బెదిరించాడు. శేఖర్ రెడ్డి ఈ విషయాన్ని రెండోసారి పోలీసుల దృష్టికి తీసుకెళ్లాడు. ఎస్‌ఐ ప్రత్యేక నిఘా ఉంచి, హైదరాబాద్‌లోని బోడుప్పల్‌లో నిందితుడిని పట్టుకున్నారు. అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నాడు. నిందితుడు సుదర్శన్‌రెడ్డి రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం మామిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించాడు. సుదర్శన్ రెడ్డి గతంలో ఆత్మ రక్షణ కోసం గన్ లైసెన్స్ తీసుకున్నాడు. 2000 సంవత్సరంలో హైదరాబాద్‌కు వచ్చాడు. ముషీరాబాద్‌లో నివాసం ఉన్నాడు. చార్మినార్‌లో 3.2 రివాల్వర్ జర్మనీ కంపెనీకి చెందినది కొన్నాడు. ముషీరాబాద్‌లో సంవత్సరం ఉండి, హబ్సిగూడలోని ఓ అపార్ట్‌మెంట్‌లో కుటుంబంతో కలిసి ఉంటున్నాడు. గతంలో సెటిల్ మెంట్ల ద్వారా వచ్చిన డబ్బులతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయగా, నష్టపోయాడు. దాంతో మళ్లీ సెటిల్‌మెంట్ల దందాకు దిగాడు. అతనిపై పలు జిల్లాల్లో ఇప్పటి వరకు 12 కేసులు నమోదయ్యాయి. అతడి నుంచి ఒక సెల్‌ఫోన్, రూ.6,000 స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు తరలించారు. కేసును చేధించిన కొత్తకోట సీఐ రాంబాబు, ఖిల్లాఘణపూర్ ఎస్‌ఐ సురేష్, కానిస్టేబుల్ లింగం, రాజులను ఎస్పీ అభినందించారు.



జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో రూ.మూడున్నర కోట్ల నోట్లతో ధనలక్ష్మి రూపంలో అమ్మవారి అలంకరణ

రూ. 3.50 కోట్లతో అమ్మవారి అలంకరణ

గద్వాల టౌన్, అక్టోబరు 4 : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు శుక్రవారం జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు ధనలక్ష్మీ దేవిగా దర్శనమిచ్చారు. రూ. 3.50 కోట్లతో చేసిన అమ్మవారి అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకున్నది. ఈ ప్రాంతంలో ఇంత పెద్ద మొత్తంలో అలంకరించడం చర్చనీయాంశంగా మారింది.





బ్రహ్మచారిణిలుగా దర్శనమిస్తున్న అలంపూర్ జోగుళాంబ, ఉమామహేశ్వరం భ్రమరాంబ అమ్మవార్లు

బ్రహ్మచారిణిగా దర్శనం

అలంపూర్ చౌరస్తా/అచ్చంపేట అర్బన్, అక్టోబరు 4: నవరాత్రి ఉత్సవాల్లో జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ జోగుళాంబ, నాగర్‌కర్నూల్ జిల్లా ఉమామహేశ్వర క్షేత్రంలోని భ్రమరాంబ అమ్మవార్లు రెండో రోజు శుక్రవారం బ్రహ్మచారిణిదేవిగా దర్శనం ఇచ్చారు. శుక్రవారం కావడంతో అలంపూర్ జోగుళాంబ అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. ఉమామహేశ్వర క్షేత్రంలో భ్రమరాంబ, ఉమామహేశ్వరుడిని రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. పాపనాశిని గుండంలో పుణ్యస్నానాలు ఆచరించి, పూజలు చేశారు. ఆలయ ఆవరణలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి



తలపడుతున్న విద్యార్థులు

ధన్వాడలో కుస్తీ పోటీలు

- రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు
- ఉమ్మడి జిల్లా నుంచి 300 మంది హాజరు

ధన్వాడ, అక్టోబరు 4 : నారాయణపేట జిల్లా ధన్వాడలో శుక్రవారం ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి బాలికల కుస్తీ పోటీలు ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ పోటీలను పేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు తాము ఎంచుకున్న ఏ క్రీడల్లోనైనా ముందుండే విధంగా ప్రయత్నించాలన్నారు. క్రీడల వల్ల ఎంతో ఉపయోగం ఉందన్నారు. ప్రభుత్వం సైతం క్రీడలకు ప్రాధాన్యతనిస్తూ క్రీడాకారులను ప్రోత్స హిస్తుందన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన విద్యార్థినులు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆటలు ఆడాలన్నారు. కుస్తీ పోటీలు ఎంతో ధైర్య సాహసంతో కూడినవన్నారు. అంతకుముందు ఆయా జిల్లాల నుంచి వచ్చిన 300 మంది క్రీడాకారులను ఎమ్మెల్యే పరిచయం చేసుకున్నారు.

కార్యక్రమంలో స్టేట్ అబ్జర్వర్ దానయ్య సంగ్రనాయక్, డీవైఎస్‌వో అశోక్, వెంకటేశం, మహ్మద్‌కరీం, రెజ్లింగ్ కోచర్లు జయపాల్, రాజ్, భాగ్య శిరీష‌శ్రీనివాసులు, మోహన్‌సింగ్, పీఈటీలు, మార్కెట్ యార్డు డైరెక్టర్లు నీరటి రాంచంద్రయ్య, జట్రం లక్ష్మయ్యగౌడ్, విండో చైర్మన్ వెంకట్రామ్‌రెడ్డి, ఎంపీడీవో సాయిప్రకాష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.



ఫుట్‌బాల్ టోర్నీ పరిశీలకుడిగా పీడీ వడెన్న



మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, అక్టోబరు 4: భద్రాది కొత్తగూడెం జిల్లాలో నేటి నుంచి 7వ తేదీ వరకు నిర్వహించనున్న ఎస్‌జీఎఫ్ అండర్-17 రాష్ట్ర ఫుట్‌బాల్ టోర్నీ పరిశీలకుడిగా పీడీ వడెన్న నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ శ్రీరామ్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. బాదేపల్లి జిల్లా పరి షత్ ఉన్నత పాఠశాలలో వడెన్న పీడీగా పని చేస్తున్నారు. వడెన్నను ఎస్ జీఎఫ్ సెక్రెటరీ శారదబాయి, పేటటీఎస్ అధ్యక్షుడు జగన్ మోహన్‌గౌడ్, పీడీలు నిరంజన్‌రావు, వేణుగోపాల్, రమేష్ బాబు, పరశు రాములు, రాజ వర్ధన్‌రెడ్డి అభినందించారు.

రేషన్ బియ్యం అక్రమ రవాణాకు సహకరించిన కానిస్టేబుల్ సస్పెన్షన్

గద్వాల క్రైం, అక్టోబరు 4 : రేషన్ బియ్యం అక్రమ రవాణాకు సహకరించిన కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేస్తూ జోగుళాంబ గద్వాల ఎస్పీ శ్రీనివాసరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వివరాల్లోకి వెళితే.. అలంపూర్ నియోజకవర్గంలోని అయిజ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ఆర్.కృష్ణయ్య రేషన్ బియ్యం అక్రమంగా రవాణా చేసి వారికి సహకరిస్తున్నారన్న సమాచారం ఉన్నతాధికారులకు అందింది. ఈ మేరకు విచారణ చేపట్టగా రుజువు కావడంతో శాఖాపరమైన క్రమశిక్షణలో భాగంగా కానిస్టేబుల్ కృష్ణయ్యను సస్పెండ్ చేశారు. పోలీస్ అధికారుల పనితీరు, సమాజంలో వారి ప్రవర్తనను పోలీస్‌శాఖ పరిశీలిస్తుందని, పోలీస్ శాఖలో పనిచేస్తూ ఇలాంటి చర్యలను ఎవరు చేసినా ఉపేక్షించేది లేదని ఎస్పీ తెలిపారు.

రేషన్‌బియ్యం పట్టివేత

హన్వాడ అక్టోబరు 4 : మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలంలోని వేపూర్ వద్ద ఉన్న రైస్‌మిల్లులో రేషన్ బియ్యాన్ని అమ్మేందుకు వెళ్తుండగా రెండు ఆటోలను పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. శుక్రవారం కోయిలకొండ మండలానికి చెందిన రాములుగౌడ్ తన ఆటోలో మూడు క్వింటాళ్లు, శ్రీను 3.5 క్వింటాళ్ల రేషన్‌బియ్యం వేపూర్ రైస్ మిల్లుకు తరలిస్తున్న రెండు ఆటోలను సీజ్ చేసినట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ముగ్గురిని కరిచిన పిచ్చికుక్క

మానవపాడు, అక్టోబర్ 4 : జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలంలోని అమరవాయిలో శుక్రవారం పిచ్చికుక్క దాడిలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉదయం ఆరు బయట ఆడుకుంటున్న ఆరేళ్ల బాలుడు రేవంత్‌పై ఒక్కసారిగా దాడి చేసింది. అందరూ అక్కడికి వెళ్లేసరిగి రేవంత్‌కి తీవ్ర గాయాలయ్యాయి. అక్కడి నుంచి కుక్క తప్పించుకుని పదేళ్ల బాలుడు శివరామరాజుపై దాడి చేసింది. అక్కడి నుంచి వెళ్లిపోయిన కుక్క దారి వెంట వెళ్తున్న పెద్ద ఆముదాలపాడు చెందిన రామకృష్ణపై దాడి చేసింది. వెంటనే మానవపాడు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం కర్నూల్, గద్వాల ఆసుపత్రికి తరలించారు. కాగా గ్రామంలోని యువకులు కుక్కను గుర్తించి వెంటాడి చంపివేశారు.



గాయపడిన బాలుడు రేవంత్

ఫైనల్‌కు చేరిన మహబూబ్‌నగర్ జట్టు

- సెమీస్‌లో 60 పరుగుల తేడాతో ఖమ్మం జట్టుపై గెలుపు
- నేడు ఫైనల్‌లో తలపడనున్న మహబూబ్‌నగర్, కరీంనగర్ జట్లు



సెమీస్‌లో గెలిచిన ఉమ్మడి మహబూబ్‌నగర్ క్రికెట్ జట్టు



అబ్దుల్‌రాఫె (110)

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, అక్టోబరు 4 : హెచ్‌సీఏ అండర్ - 19 అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నీలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జట్టు ఫైనల్‌కు చేరింది. శుక్రవారం వరంగల్‌లోని మొగిలిచర్ల మైదానంలో నిర్వహించిన సెమీస్‌లో మహబూబ్‌నగర్, ఖమ్మం జట్లు తలబడ్డాయి. 60 పరుగుల తేడాతో ఖమ్మంపై ఘన విజయం సాధించి మహబూబ్‌నగర్ జట్టు ఫైనల్‌కు చేరింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన మహబూబ్‌నగర్ జిల్లా జట్టు 50 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 234 పరుగులు చేసింది. జట్టులో అబ్దుల్ రాఫె 146 బంతుల్లో 11 ఫోర్లు రెండు సిక్స్‌లతో (110 పరుగులు) రాణించాడు. షాదాబ్ అహ్మద్ 22, సాహిల్ 45, నగేష్ 25 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఖమ్మం జట్టు 39.3 ఓవర్లలో 174 పరుగులకు కుప్ప కూలింది. జట్టులో డెవిన్ 93, నిఖిల్ 34 పరుగులు చేశారు. జిల్లా బౌలర్లలో ముఖిద్ నాలుగు వికెట్లు తీసి జిల్లా జట్టు విజయానికి కృషి చేశారు. జిల్లా జట్టు ఫైనల్‌కు చేరడంపై జట్టు క్రీడాకారులు, కోచ్ అబ్దుల్లాను జిల్లా క్రికెట్ సంఘం ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ అభినందించారు. శనివారం ఫైనల్ మ్యాచ్‌లో మహబూబ్‌నగర్, కరీంనగర్ జట్లు తలబడనున్నాయి.

మహాలక్ష్మిగా వాసవీమాత

- రూ.50 లక్షల నోట్లతో అలంకరణ



దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా శుక్రవారం జోగుళాంబ గద్వాల జిల్లా శాంతినగర్‌లోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో వాసవీ మాతను మహాలక్ష్మీ దేవిగా రూ.50 లక్షల నగదుతో అలంకరించి పూజలు చేశారు. ఉదయం నుంచి మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి అభిషేకాలు, కుంకుమార్చనలు, హోమాలు నిర్వహించారు. - వడ్డేపల్లి

కొలువుదీరిన 'జోగుళాంబ' పాలకమండలి

- అమ్మవారి సన్నిధిలో ప్రమాణ స్వీకారం చేసిన చైర్మన్, సభ్యులు

అలంపూర్ చౌరస్తా, అక్టోబరు 4: అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర దేవస్థాన నూతన పాలక మండలి శుక్రవారం ఏర్పాటైంది. 13 మంది సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆలయ ఈవో పురేందర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత హాజరయ్యారు. అమ్మవారి సన్నిధిలో లాంఛనంగా పాలకమండలి సభ్యులుగా ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం అక్కడి నుంచి చైర్మన్ ఛాంబర్‌లోకి వచ్చి సభ్యులందరూ చైర్మన్‌ను ఎన్నుకునే ప్రక్రియ మొదలైంది. సభ్యురాలు నాగశిరోమణి కొంకల నాగేశ్వరరెడ్డిని ప్రతిపాదించగా మరో సభ్యుడు జగదీశ్వర్‌గౌడు బలపరిచారు. దీంతో మిగతా సభ్యులందరూ ఆమోదించడంతో చైర్మన్ ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. పదవీకాలం ఉన్నంత వరకు అమ్మవారి సేవలో తరిస్తానని, ఆలయ అభివృద్ధికి పాటు పడతానని చైర్మన్ అన్నారు. అనంతరం సంపత్‌కుమార్ మాట్లడుతూ.. ఆలయంలో పెండింగ్ పనులన్నీ పూర్తి చేస్తామని, పురావస్తుశాఖతో ఉన్న సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం ఆలయం నుంచి సభాస్థలి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. సంపత్‌కుమార్ మాట్లాడుతూ.. పదవులు రానివారు ఎవరూ అధైర్య పడొద్దని, పార్టీ కోసం కష్టపడ్డవారందరికీ పదవులు వస్తాయని అన్నారు. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి హాజరై చైర్మన్, సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.



ప్రమాణస్వీకారం అనంతరం ఆలయం వద్ద పాలకమండలి సభ్యులు

దేవాలయాల అభివృద్ధికి నిధులివ్వాలి : ఎంపీ డీకే అరుణ

మహబుబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ శుక్రవారం నవరాత్రుల సందర్భంగా ముఖ్యనాయకులతో కలిసి అలంపూర్ ఆలయాలను దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం నూతన చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లడుతూ.. ఆలయాల అభివృద్ధికి ఇప్పటికే ప్రసాద్ స్కీం ద్వారా కేంద్రం ఇచ్చిన నిధులు పనులు పూర్తయ్యాయని, రాష్ట్ర ప్రభుత్వం కూడా ఆలయానికి నిధులివ్వాలని కోరారు. జోగుళాంబ రైల్వేహాల్ట్‌ను భవిష్యత్‌లో పెద్దస్టేషన్‌గా మార్చుతామని అన్నారు.



పూజలు చేస్తున్న ఎంపీ డీకే అరుణ

సీఎం పర్యటనకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

వంగూరు, అక్టోబరు 4: దసరా వేడుకల్లో పాల్గొనేందుకు సీఎం రేవంత్‌రెడ్డి స్వగ్రామమైన కొండారెడ్డిపల్లికి 12న వస్తున్నారని, అందుకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అధికారులకు సూచించారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలంలోని కొండారెడ్డిపల్లిని ఎమ్మెల్యే సందర్శించారు. నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాల పనులను పరిశీలించారు. అదేవిధంగా హెలీప్యాడ్ స్థలాన్ని అధికారులతో కలిసి చూశారు. గ్రామంలో చేపట్టే అభివృద్ధి పనులు సిద్ధంగా ఉంచాలని సూచించారు. రెవెన్యూ, పోలీస్ వివిధ శాఖల అధికారులతో సమావేశం అయ్యారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సీఎంకు ఘన స్వాగతం పలకాలని తెలిపారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

ఫొటోగ్రాఫర్ల అభ్యున్నతికి కృషి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, అక్టోబరు 4 : వనపర్తి నియోజకవర్గ పరిధిలో ఉండే ఫొటోగ్రాఫర్ల అభ్యున్నతికి కృషి చేస్తానని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. శుక్రవారం వనపర్తి ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో క్రికెట్ పోటీలు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. కాసేపు ఆయన క్రికెట్ ఆడి అందరిని ఉత్సాహ పరిచారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఫొటోగ్రాఫర్ల కమ్యూనిటీహాల్ కోసం స్థలం సేకరించేందుకు సహకరిస్తానన్నారు. ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న ఫొటోగ్రాఫర్లు బ్యాంకు రుణాలు పొందేందుకు తన వంతు సహాయ సహకారాలు ఉంటాయన్నారు. ఫొటో స్టూడియోలకు తప్పకుండా ఇన్సూరెన్స్ చేసుకుని ఉండాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యేని సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఎమ్మెల్యే వెంట మునిసిపల్ చైర్మన్ మహేష్, వైస్ చైర్మన్ కృష్ణయ్య చీర్ల చందర్, సత్యశీ లారెడ్డి, తిరుపతిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



క్రికెట్ ఆడుతున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

ముగిసిన పోలీస్ డ్యూటీ మీట్

మహబూబ్‌నగర్, అక్టోబరు 4: జోగుళాంబ రేంజ్ పోలీస్ డ్యూటీ మీట్‌లో మహబూబ్‌నగర్ జట్టు విజేతగా నిలిచింది. రెండ్రోజులుగా మహబూబ్‌నగర్ పోలీస్ మైదానంలో జోన్ పరిధిలోని జిల్లాల పోలీస్‌లకు డ్యూటీ మీట్ నిర్వహించారు. ఇందులో మహబూబ్‌నగర్ జట్టు ఓవరాల్ ఛాంపియన్‌గా నిలువగా, పలు విభాగాల్లో ఆయా జిల్లాల జట్లకు ద్వితీయ, తృతీయ బహుమతులను శుక్రవారం జోగుళాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా, రేంజ్ స్థాయి డ్యూటీ మీట్ ముగిసినందున విజేతలుగా నిలిచిన వారు రాష్ట్ర స్థాయి డ్యూటీమీట్‌లో పాల్గొంటారన్నారు. అక్కడ గెలిచిన వారు జాతీయ డ్యూటీ మీట్‌కు ఎంపికవుతారని చెప్పారు. పోలీసులలో ఉన్న నైపుణ్యాలను వెలికితీసేందుకు ఏటా డ్యూటీ మీట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇది సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవడానికి దోహదపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి, నారాయణపేట ఎస్పీ యోగేష్‌గౌతమ్, వనపర్తి ఎస్పీ గిరిధర్, జోగుళాంబ గద్వాల ఎస్పీ శ్రీనివాసరావు, అదనపు ఎస్పీ రాములు, ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, నాగర్‌కర్నూల్ అదనపు ఎస్పీ రామేశ్వర్, వనపర్తి అదనపు ఎస్పీ రాందాస్‌తేజ, నారాయణపేట ఏఆర్ అదనపు ఎస్పీ రియాజ్ ఉల్ హక్, డీఎస్పీలు వెంకటేశ్వర్లు, రమణారెడ్డి, సుదర్శన్, నర్సింహులు, నరేందర్‌రావు, శ్రీనివాసులు పాల్గొన్నారు.



మహబూబ్‌నగర్ టీమ్‌కు బహుమతి అందజేస్తున్న డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

కొల్లాపూర్, అక్టోబరు 4 : నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలోని సోమశిలలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఓ వ్యక్తి నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ నాగిరెడ్డి శుక్రవారం తెలిపారు. సోమశిలలో గంజాయి అమ్ముతున్నారనే సమాచారం మేరకు మహబూబ్‌నగర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీంతో కలిసి గ్రామంలో నిఘా పెట్టగా రెడ్డిగారి మల్లయ్య నుంచి 20 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని, అతడిని అరెస్టు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. తనిఖీలలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వెంకటేశ్వర్‌రెడ్డి, కొల్లాపూర్ ఎక్సైజ్ ఎస్ఐ హనుమంత్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు గద్దర్ విగ్రహావిష్కరణకు సర్వం సిద్ధం

మన్ననూర్, అక్టోబరు 4: నల్లమల ముఖ ద్వారమైన అమ్రాబాద్ మండలం మన్ననూరులోని అంబేద్కర్ కూడలి వద్ద గద్దర్ విగ్రహావిష్కరణ శనివారం నిర్వహించేందుకు ప్రజా సంఘాల నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాట్లను పూర్తి చేశారు. మధ్యాహ్నం 2 గంటలకు విగ్రహావిష్కరణ, సభ ఉంటుందని నాయకులు తెలిపారు. కార్యక్రమానికి ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే వంశీకృష్ణ, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, విమలక్క, కంచె ఐలయ్య, పలువురు నాయకులు పాల్గొననున్నారు. నల్లమల ప్రజలు అధిక సంఖ్యలో హాజరుకావాలని నిర్వాహకులు కోరారు.

మొక్కలు తిన్నందుకు.. గొర్రెల యజమానికి జరిమానా

వడ్డేపల్లి, అక్టోబరు 4 : జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మునిసిపాలిటీ పరిధిలోని డిగ్రీ కళాశాల వద్ద వనమహోత్సవంలో భాగంగా నాటిన మొక్కలు గొర్రెలు మేయడంతో పైపాడుకు చెందిన కురువ మద్దిలేటికి రూ.వెయ్యి జరిమానా విధించామని మునిసిపల్ కమిషనర్ జి.లక్ష్మారెడ్డి శుక్రవారం తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వనమహోత్సవం కార్యక్రమంలో మునిసిపాలిటీ పరిధిలో కొన్ని వేల మొక్కలు నాటామని, వాటిని సంరక్షించుకునే బాధ్యత అందరిపై ఉంటుందన్నారు. యజమానులు తమ పశువులను అదుపులో ఉంచుకోవాలన్నారు. వాటిని ఎక్కడ పడితే అక్కడ మేతకు పంపి మొక్కలను తింటే జరిమానాలు విధిస్తామన్నారు.

పిడుగుపాటుకు ఆవు మృతి

ధరూరు, అక్టోబరు 4 : పిడుగుపాటుకు ఆవు మృతి చెందిన ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా ధరూరు మండలంలోని ఖమ్మంపాడులో గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బోయ రాముడుకు చెందిన ఆవు పొలం వద్ద ఉండగా, వర్షంతో పాటు పిడుగు పడటంతో మృతి చెందిందని తెలిపారు. కుటుంబానికి ఆసరాగా ఉన్న ఆవు చనిపోవడంతో బాధితుడిని ఆర్థికంగా ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

గండీడ్, అక్టోబరు 4: మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలంలోని రుసుంపల్లికి చెందిన సాకలి నర్సింహులు గేదె విద్యుదాఘాతంతో మృతి చెందింది. శుక్రవారం తన వ్యవసాయ పొలం వద్ద గేదెను కట్టేసి ఇంటికి వచ్చాడు. మధ్యాహ్నం వెళ్లే సరికి విద్యుత్ తీగలు తెగి కింద పడడంతో గేదె షాక్‌కు గురై మృతి చెందిదని రైతు నర్సింహులు తెలిపారు. గేదె విలువ రూ.లక్ష ఉంటుందని రైతు వాపోయాడు.

మేకల మందపై తోడేలు దాడి

బిజినేపల్లి, అక్టోబరు 4 : మేతకు వెళ్లి తిరిగి వస్తున్న మేకల మందపై తోడేలు దాడి చేసి రెండు మేకపోతులను చంపేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు, గంగారం ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ చంటి శుక్రవారం తెలిపిన వివరాల మేరకు నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని కీమ్యాతండాకు చెందిన బాషా, హన్మానాయక్ రోజులాగే మేకలను మేపి సాయంత్రం ఇంటి సమీపంలోని పాకలో ఉంచారు. పాక బయట ఉన్న రెండు మేకపోతులను తోడేలు మాటు వేసి దాడి చేసింది. ఆ సమయంలో తండావాసులు చిరుతపులి అనుకొని భయాందోళనతో ఇంట్లో నుంచి బయటకు రాలేదని వాపోయారు. శుక్రవారం ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎఫ్ఎస్ఓ చంటి మృతి చెందిన మేకపోతులను పరిశీలించి చిరుతపులి కాదని, తోడేలు దాడి చేసినట్లు గుర్తించారు. అటవీ ప్రాంతంలోకి మేకలను, పశువులను తీసుకెళ్లవద్దని, అలాగే అడవికి సమీపంలో పంట పొలాలు ఉన్న రైతులు ఒక్కరిగా కాకుండా గుంపులుగా వెళ్లాలని సూచించారు.

డ్రైవర్‌పై కేసు నమోదు

వెల్దండ, అక్టోబరు 4 : ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కురుమూర్తి తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలంలోని కొట్ర సమీపంలో గురువారం రాత్రి కొట్రకు చెందిన మునగశెట్టి శేఖర్ తన ఆటోలో స్వగ్రామానికి వస్తుండగా, ఎదురుగా కల్వకుర్తి వైపు వచ్చిన కారు ఢీకొంది. ఆటోలో ఉన్న శేఖర్‌తో పాటు అదే గ్రామానికి చెందిన కృష్ణయ్య గాయపడ్డారు. ఈ మేరకు శేఖర్ భార్య రేణుక ఫిర్యాదుతో కారు డ్రైవర్ సత్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

హన్వాడ అక్టోబరు 4: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పరును పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. శుక్రవారం తెల్లవారుజామున వెంకటాపూర్ చెందిన గొల్ల తిరుపతయ్య తన టిప్పర్‌లో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న సమాచారంతో చిన్నదర్పల్లి సమీపాన హనుమాన్ ఆలయం వద్ద పట్టుకొన్నట్లు ఎస్ఐ తెలిపారు. టిప్పర్‌ను పోలీసుస్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స

మహబూబ్‌నగర్ వైద్యవిభాగం, అక్టోబరు 4 : మహబూబ్‌నగర్ జిల్లా జనరల్ ఆసుపత్రిలో వైద్యులు అరుదైన శస్త్ర చికిత్స చేశారు. స్వరపేటిక నాడులపై ఎడమవైపు కణితి ఉండటంతో గొంతు నొప్పితోపాటు మాట బొంగురుపోయి మూడు నెలలుగా బాధపడుతున్న ఓ రోగికి అరుదైన శస్త్ర చికిత్స చేసి ఉపశమనం కలిగించారు. గుండుమాల్‌కు చెందిన కౌశిక్‌రెడ్డి (16) స్వరపేటికలో కణితి ఏర్పడటంతో మూడు నెలలుగా ఇబ్బందులు పడ్డాడు. జనరల్ ఆసుపత్రిలోని ఈఎన్‌టీ విభాగాన్ని ఆశ్రయించిన యువకుడిని ఈఎన్‌టీ విభాగాధిపతి, ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ సంపత్ కుమార్‌సింగ్ అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. శుక్రవారం యువకుడిని వైద్య బృందం శ్రీకాంత్, వైష్ణవి, రామకృష్ణ, మాధవి, అలీ, సంజీవ్, భారతి మైక్రోలారింజియల్ శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించి కణితిని తొలగించారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఈ శస్త్ర చికిత్స మొదటిదని డా.సంపత్ వెల్లడించారు.

మహిళను వేధించిన వ్యక్తిపై కేసు

కోస్గి, అక్టోబర్ 4 : మహిళను వేధించిన వ్యక్తిపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ శ్యాంసుందర్ తెలిపిన వివరాల ప్రకారం.. కోస్గి ఆర్టీసీ బస్టాండ్‌లో గురువారం రాత్రి వికారాబాద్ జిల్లా దోమ మండలం గుముదాలకు చెందిన చెన్నయ్య బస్టాండ్‌లో ఓ మహిళను వేధించి, ఆమె నుంచి డబ్బులు తీసుకొని బెదిరించడంతో పోలీసులకు సమాచారమిచ్చింది. పోలీసులు అతన్ని పటుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

» పేట ఎమ్మెల్యే డా.చిట్టెం పర్ణికారెడ్డి

నారాయణపేట రూరల్, అక్టోబరు 4 : రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధరను పొందాలని పేట ఎమ్మెల్యే డా.చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. శుక్రవారం పేట మండలంలోని కొల్లంపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ రైతులు దళారుల చేతిలో మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలన్నారు. దొడ్డురకం క్వింటాల్‌కు రూ.2,320, సన్నరకం క్వింటాల్‌కు రూ.2,320తో పాటు, రూ.500ల బోనస్‌తో ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో డీఆర్డీవో మొగులప్ప, సివిల్ సప్లై డీఎం దేవదాస్, డీఎస్‌వో సుదర్శన్, డీఏవో జాన్‌సుధాకర్, ఎంపీడీవో సుదర్శన్, ఐకేపీ ఏపీఎం గోపాల్ తదితరులున్నారు.

పరిసరాల పరిశుభ్రతను పాటించాలి

» ట్రైనీ కలెక్టర్ గరీమానరుల
» పల్లె దవాఖాన, డంపింగ్ యార్డుల పరిశీలన


పల్లె దవాఖానలో పరిసరాలను పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్ గరీమానరుల

మరికల్, అక్టోబరు 4 : సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకొని ప్రతీ ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ట్రైనీ కలెక్టర్ గరీమానరుల ప్రజలకు సూచించారు. మండల పరిధిలోని తీలేరు గ్రామంలో పల్లె దవాఖాన, ఇబ్రహీంపట్నం గ్రామంలో డంపింగ్ యార్డును ట్రైనీ కలెక్టర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె పల్లె దవాఖానలో రికార్డులతో పాటు, పరిసరాలను పరిశీలించారు. డంపింగ్ యార్డు వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను గ్రామస్థులు ట్రైనింగ్ కలెక్టర్‌కు వివరించారు. సమస్యను పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆమె పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. అనంతరం మాట్లాడుతూ పల్లె దవాఖానలో వైద్యులు 24 గంటలు అందుబాటులో ఉండాలన్నారు. ఎంపీవో పావని, ఆశ వర్కర్లు, ఆరోగ్య సిబ్బంది, గ్రామస్థులు ఉన్నారు.

డ్రైడే ఫ్రైడేను పరిశీలించిన జిల్లా మలేరియా అధికారి


ఊట్కూర్‌లో పరిసరాలను పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి డాక్టర్ రాఘవేందర్‌రెడ్డి

ఊట్కూర్, అక్టోబరు 4 : మండల కేంద్రంలో జరుగుతున్న డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ రాఘవేందర్‌రెడ్డి పరిశీలించారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి పరిశీలించిన ఆయన కొన్నిచోట్ల నిల్వ ఉంచిన నీటిని పారవేయించి, దోమల నివారణ మందును పిచికారి చేయించారు. ఇంటి యజమానులతో మాట్లాడి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు నర్సింహులు, శంకర్, ఆరోగ్య కార్యకర్త గోవిందమ్మ, ఆశ కార్యకర్త పుష్ప తదితరులున్నారు.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలి

» ఎస్‌బీఐ, సీఎఫ్ఎల్ కౌన్సిలర్ ఎస్‌కే చాంద్‌సుల్తానా


ఊట్కూర్‌లో ఆర్థిక అక్షరాస్యత సదస్సులో మాట్లాడుతున్న చాంద్ సుల్తానా

ఊట్కూర్, అక్టోబరు 4 : సైబర్ నేరగాళ్లతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సీఎఫ్ఎల్ కౌన్సిలర్ ఎస్‌కే చాంద్‌సుల్తానా అన్నారు. శుక్రవారం ఊట్కూర్ మండలంలోని పెద్దజట్రం గ్రామ కెనరా బ్యాంక్ వద్ద వీఐడీఎస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై మహిళల సంఘాల సభ్యులకు, రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏ బ్యాంక్ కూడా మీ వ్యక్తిగత సమాచారాన్ని ఫోన్‌లో అడగదని గుర్తించుకోవాలన్నారు. ఆర్థిక నేరగాళ్లు పెరగడంతో ఓటీపీలు, ఏటీఎం నెంబర్లు ఎవరికీ చెప్పొద్దన్నారు. అలాగే ప్రభుత్వం తీసుకొచ్చిన బీమా పథకాలు, అకౌంట్ లావాదేవీలతో పాటు సుకన్య సమృద్ధి పథకం గురించి వివరించారు. కార్యక్రమంలో కెనరా బ్యాంక్ సిబ్బంది, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

మక్తల్‌లో కొనసాగుతున్న డిజిటల్ కార్డుల సర్వే


మక్తల్‌లో డిజిటల్ కార్డుల సర్వే చేపడుతున్న అధికారులు

మక్తల్, అక్టోబరు 4 : పట్టణంలోని 13వ వార్డులో శుక్రవారం రెండో రోజు డిజిటల్ కార్డుల సర్వే కొనసాగింది. పుర కమిషనర్ భోగేశ్వర్లు సిబ్బందితో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం నిర్దేశించిన 11 కాలమ్స్‌లో వివరాలు నమోదు చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన డిజిటల్ సర్వేలో భాగంగా పైలట్ ప్రాజెక్టు కింద మక్తల్ 13వ వార్డును ఎంపిక చేసినట్లు తెలిపారు. ఐదు పనిదినాల్లో సర్వే పూర్తిచేసి నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు. కార్యక్రమంలో అమర్, గులాం, కృష్ణయ్య తదితరులున్నారు.

రోడ్లకు మరమ్మతు చేయించండి..


ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

నారాయణపేట, అక్టోబరు 4 : జిల్లాలో నారాయణపేట-మక్తల్, అప్పక్‌పల్లి-కోటకొండ రహదారులు గుంతలమయమయ్యాయని, వాహనదారులు, ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి వెంటనే బాగు చేయించాలని సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం నారాయణపేట ఆర్డీవో కార్యాలయంలో అధికారి బాలరాజుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి గోపాల్, బాల్‌రామ్‌లు రోడ్ల దుస్థితిని అధికారికి వివరించారు. అదేవిధంగా, ఆగిపోయిన అప్పక్‌పల్లి-కోటకొండ రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బాల్‌రామ్, కాశప్ప, ప్రకాష్, గోవిందు, రవి, మల్లేష్, నరసింహ తదితరులున్నారు.

కొనసాగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాలు


మక్తల్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో కూర్మావతారంలో దర్శనం ఇస్తున్న స్వామివారు


పేట శక్తిపీఠంలో గాయత్రీదేవిగా అమ్మవారు

నారాయణపేట/నారాయణపేట టౌన్/దామరగిద్ద/మరికల్/మక్తల్/ఊట్కూర్, అక్టోబరు 4 : దేవీ శరన్నవరాత్రి దసరా వేడుకలు శుక్రవారం నారాయణపేట జిల్లా వ్యాప్తంగా రెండో రోజు ప్రత్యేక పూజలు కొనసాగాయి. నారాయణపేట పట్టణంలోని భవానీ, చౌడేశ్వరి, బాలాజీ, రాఘవేంద్రస్వామి, అనంతసేన ఆలయం, కాళికామాతా, మరిగమ్మ, శక్తిపీఠంలో ఉత్సవాలు కొనసాగాయి. బ్రాహ్మన్‌వాడి దుర్గమాత విగ్రహం వద్ద స్త్రీ వైద్య నిపుణురాలు డాక్టర్ గీతావిశ్వనాథ్ ప్రత్యేక పూజలో పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కార్తీక్, సత్తిరెడ్డి, తిరుమలేష్, అంబరేష్‌డగే, నవీన్‌కల్యాణ్, దినేష్ తదితరులు పాల్గొన్నారు. శక్తిపీఠంలో గాయత్రీదేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు. స్వామి శాంతనంద ఆధ్వర్యంలో హోమంతో పాటు, అన్నదానం, ప్రత్యేక పూజలు జరిగాయి. పేట అశోక్‌నగర్‌లోని మలాంబికాదేవీ ఆలయంలో మహాలక్ష్మీదేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు. వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంతో పాటు, భవానీ మందిర్‌లో అమ్మవారు బాలత్రిపురసుందరిదేవిగా దర్శనమిచ్చారు. కోటకొండ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. అలాగే నారాయణపేట అంబభవానీ ఆలయంలో బాలత్రిపురసుందరి దేవిగా, పేట బ్రహ్మణవాడి చౌడేశ్వరీ ఆలయంలో గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు.

దామరగిద్దలోని వాసవి మాత ఆలయంలో లక్ష్మీదేవి అవతారంలో వాసవీమాత దర్శనమిచ్చారు. మహిళలు అమ్మవారికి కుంకుమార్చనతో పాటు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మరికల్‌లోని కాళికామాత ఆలయంలో మహిళలు అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం అమ్మవారికి వడిబియ్యం నింపి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం బతుకమ్మ ఆటలతో సంబురాలు నిర్వహించారు.

అదేవిధంగా, మక్తల్ పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరిదేవీ, ఆలయంలో వాసవీ మాత లలితాదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారు కుర్మావతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. సాయంత్రం కల్పవృక్ష వాహనంపై స్వామివారిని ఊరేగించారు. నల్లజానమ్మ ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు ఆలయం వద్ద బతుకమ్మ సంబురాలు నిర్వహించారు.

ఊట్కూర్ మండలం బిజ్వార్ గ్రామంలోని అంభాత్రాయ క్షేత్రంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మహాలక్ష్మి, మహా సరస్వతి, ముగ్గురమ్మలను డోలారోహణ కార్యక్రమం నిర్వహించారు. స్వామి ఆదిపరాశ్రీ భక్తులతో కలిసి కోలాటం ఆడుతూ వారిని ఉత్సాహపరిచారు.


ఊట్కూర్ అంభాత్రయ క్షేత్రంలో అమ్మవారికి పూజలు చేస్తున్న స్వామి ఆదిపరాశ్రీ

రుణమాఫీ రాలేదు.. గృహజ్యోతి లేదు

» సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే ఎదుట సమస్యల ఏకరువు


వన్యప్రాణి దినోత్సవం సందర్భంగా జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

ధన్వాడ, అక్టోబరు 4 : 'మా గ్రామంలో ఇప్పటికీ రుణమాఫీ కాని రైతులు ఎంతోమంది ఉన్నారు.. మాకు రుణమాఫీ రాలేదు.. గృహజ్యోతి అమలు కావడం లేదు.. జీరో బిల్లు రాక గ్రామాల్లో కొంతమందికి సమాధానం చెప్పలేకపోతున్నాం.. మా ఊరికి రోడ్డు లేదు.. మా తండాకు రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేయించండి' అంటూ ఒక్కో గ్రామం నుంచి బాధితులు, కాంగ్రెస్ నాయకులు పలు సమస్యలను ఎమ్మెల్యే ఎదుట ఏకరువు పెట్టారు. శుక్రవారం ధన్వాడ తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల వారీగా సమస్యలను సానుకూలంగా విని అధికారులతో మాట్లాడించారు. గ్రామాల్లో ప్రధానమైన, అత్యవసరమైన సమస్యలను వెంటనే పరిష్కరించడంలో ప్రత్యేకాధికారులు, గ్రామ కార్యదర్శులు చొరవ చూపించాలని కోరారు. కాగా, పలు గ్రామాల్లో ఎక్కువగా రుణమాఫీ కాలేదని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. అదేవిధంగా, మురుగు కాల్వలు, మిషన్ భగీరథ సమస్యలను విన్నవించారు. సమావేశంలో ఎంపీడీవో సాయిప్రకాష్, తహసీల్దార్ సింధుజ, విండో చైర్మన్ వెంకట్రామ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నరహరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వన్యప్రాణి దినోత్సవం

ధన్వాడ మండల కేంద్రంలో శుక్రవారం అటవీ శాఖ ఆధ్వర్యంలో వన్యప్రాణి దినోత్సవం నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన వన్యప్రాణి దినోత్సవానికి ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె జెండా ఊపి, ర్యాలీని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ వన్యప్రాణుల సంరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అబ్దుల్‌ముజీబ్, ఎన్ఎస్ఎస్ అధికారి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సిటీ గ్రంథాలయం మాదిరి సౌకర్యాలు కల్పిస్తా

» రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్


వార్ల విజయ్‌కుమార్‌తో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేయిస్తున్న రియాజ్

నారాయణపేట టౌన్, అక్టోబరు 4 : సిటీ గ్రంథాలయంలో ఉన్న సౌకర్యాలు నారాయణపేట గ్రంథాలయంలో కల్పిస్తానని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని శీలాగార్డెన్స్‌లో శుక్రవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే గుర్నాథ్‌రెడ్డి, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్, నారాయణపేట, మక్తల్ ఎమ్మెల్యేలు పర్ణికారెడ్డి, వాకిటి శ్రీహరిలు హాజరయ్యారు. ముందుగా సరస్వతి మాత చిత్రపటానికి పూజలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా వార్ల విజయ్‌కుమార్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం రియాజ్ మాట్లాడుతూ మునిసిపాలిటీలు, గ్రామ పంచాయతీల ద్వారా వచ్చే సెస్‌ను చెల్లించి గ్రంథాలయాలను బతికించాలన్నారు. గత ప్రభుత్వం గ్రంథాలయాలను నిర్వీర్యం చేసిందన్నారు. ఉపాధి, ఉద్యోగాలకు అవసరమైన పుస్తకాలను గ్రంథాలయాల్లో అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు.

ఎమ్మెల్యేలు పర్ణికారెడ్డి, వాకిటి శ్రీహరిలు మాట్లాడుతూ జిల్లాలోని గ్రంథాలయాలకు పూర్వ వైభవం తీసుకరావాలన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజయ్‌కుమార్ మాట్లాడుతూ నారాయణపేట జిల్లా గ్రంథాలయాన్ని రాష్ట్రంలోనే నెంబర్‌వన్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్ రెడ్డి, మునిసిపల్ చైర్‌పర్సన్ గందె అనసూయ, మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివారెడ్డి, వైస్ చైర్మన్ కొనంగేరి హన్మంతు, కౌన్సిలర్లు సలీం, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ సర్వేలో ఒక్క కుటుంబం కూడా మిస్ కావొద్దు

» కలెక్టర్ సిక్తా పట్నాయక్


బాలుర వసతి గృహంలో డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల హెల్ప్‌డెస్క్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

నారాయణపేట టౌన్, అక్టోబరు 4 : డిజిటల్ సర్వేలో ఒక్క కుటుంబం కూడా మిస్ కావొద్దని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని 15వ వార్డులో డిజిటల్ సర్వే ప్రక్రియను కలెక్టర్ శుక్రవారం పరిశీలించారు. సర్వే ఎలా చేస్తున్నారు?, కుటుంబ సభ్యుల వివరాలు ఎలా నమోదు చేస్తున్నారు?, జాబితా ఎలా సిద్ధం చేస్తున్నారని సిబ్బందిని ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. ఇప్పటివరకు 205 కుటుంబాల సర్వే పూర్తి అయ్యిందని, ఇంకా 40 కుటుంబాల సర్వే చేయాల్సి ఉందని మునిసిపల్ కమిషనర్ సునీత కలెక్టర్‌కు తెలిపారు. సర్వే ప్రక్రియను జాగ్రత్తగా పూర్తి చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ జిల్లా కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతిగృహంలో కొనసాగుతున్న డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియను పరిశీలించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రక్రియను కొనసాగించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కాగా పీఆర్టీయూటీఎస్, తపస్ ఆధ్వర్యంలో హెల్ప్‌డెస్క్‌లు కొనసాగుతున్నాయి.

వానాకాలం పత్తి కొనుగోలుకు ఏర్పాట్లు చేయాలి..

వానాకాలం పత్తి కొనుగోలుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పత్తి కొనుగోలు జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఈ సంవత్సరం పత్తి క్వింటాల్‌కు రూ.7,521 మద్దతు ధరను ప్రభుత్వం ప్రకటించిందని, తేమ శాతం 12కు మించకుండా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పత్తి అమ్మిన తర్వాత డబ్బులు రైతు ఖాతాలో జమ అయ్యేలా ఆధార్‌కార్డు అనుసంధానంతో చర్యలు చేపట్టాలన్నారు. పత్తి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఫైర్ సేఫ్టీ యంత్రాలను జిన్నింగ్ మిల్లులో ఏర్పాటుచేసుకోవాలని కలెక్టర్ సూచించారు. అంతకుముందు సమావేశంలో డీఎం బాలమణి మాట్లాడుతూ ఈ సంవత్సరం జిల్లాలో ఒక లక్షా 65 వేల 150 ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేశారని, అందుకు గాను తొమ్మిది లక్షల 90 వేల 900 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేయాల్సి ఉంటుందన్నారు. నారాయణపేట మక్తల్ మార్కెట్‌లో సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని, వాటితో పాటు పేట నియోజకవర్గంలో నాలుగు, మక్తల్‌లో జిన్నింగ్ మిల్లులు ఉన్నాయన్నారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, ఆర్డీవో మేఘాగాంధీ, సీసీఐ జిల్లా మేనేజర్ దిలీప్ తదితరులున్నారు.

నారాయణపేట-మక్తల్ నాలుగు లేన్ల రహదారి చేపట్టాలి

» సీపీఎం ఆందోళన


ఊట్కూర్ చెక్‌పోస్టు సమీపంలో రోడ్డుపై ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

ఊట్కూర్, అక్టోబరు 4 : నారాయణపేట నుంచి మక్తల్ వరకు గుంతలమయంగా మారిన బీటీ రోడ్డును వెంటనే నాలుగు లేన్ల రోడ్డుగా మార్చి పనులను చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్రామ్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఊట్కూర్ వద్ద బీటీ రోడ్డుపై నాయకులు ఆందోళన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ రవికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వెంకట్రామ్‌రెడ్డి మాట్లాడుతూ గత పదేళ్ల నుంచి నారాయణపేట-మక్తల్ రోడ్డు పనులు చేపట్టకపోవడంతో రోడ్డు పూర్తి స్థాయిలో ధ్వంసమై గుంతలమయంగా మారిందని అన్నారు. పరిసరాల గ్రామాల ప్రజలు ప్రజాప్రతినిధులు, అధికారులకు ఎంత చెప్పినా నేటికీ రోడ్డు పనులు మాత్రం జరగలేదని అన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా రోడ్లన్నీ ధ్వంసమై ఫీట్ లోతు వరకు గుంతలు ఏర్పడ్డాయని అన్నారు. వెంటనే అధికారులు స్పందించి పనులు చేపట్టకపోతే సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపడతామని అన్నారు. అదేవిధంగా, మండలంలోని నిడుగుర్తి గ్రామంలో గల ఎస్సీ కాలనీ, కురువగేరి వీధుల్లో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ సీపీఎం నాయకులు ఎంపీడీవో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ హబీబ్‌కు వినతిపత్రం అందించారు. సీఐటీయూ మండల కన్వీనర్ నారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు శంకర్ తదితరులున్నారు.

కోస్గిలో ఎర్రకుంట సర్వే

కోస్గి, అక్టోబరు 4 : మునిసిపాలిటీ పరిధిలోని ఎర్రకుంటను ఇరిగేషన్, మునిసిపల్ అధికారులు సర్వే చేశారు. శుక్రవారం కోస్గి పట్టణం నడిబొడ్డున ఉన్న ఎర్రకుంట ఆక్రమణకు గురైందని ఫిర్యాదులు రావడంతో అధికారులు ఎఫ్‌టీఎల్ బఫర్‌జోన్ సర్వే చేశారు. ప్రస్తుతం ఎద్దులమార్కెట్ నిర్వహణకు బల్దియా అధికారులు కుంటలో మట్టివేసి ఎత్తు చేయడంతో కుంటకట్టపై నీటి ఒత్తిడి పడుతోందని తద్వారా కట్ట పగిలే ప్రమాదం ఉందని అధికారులు పేర్కొన్నారు. త్వరలో మట్టిని ఖాళీ చేస్తామని కమిషనర్ శశిధర్ తెలిపారు. అదేవిధంగా ఎఫ్‌టీఎల్‌లో సుమారు 15 దుకాణాలు నిర్మించుకున్నారని వాటిని వెంటనే తీయించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. త్వరలో దుకాణ నిర్మాణదారులకు ఇరిగేషన్, మునిసిపల్ సంయుక్తంగా నోటీసులు అందిస్తామని ఇరిగేషన్ ఏఈ నిర్మల, డీఈ తెలిపారు. కాగా పట్టణంలో మరిన్ని చెరువు కాలువలు, కుంటలు ఆక్రమణకు గురయ్యాయని తమ దృష్టికి వచ్చిందని వాటిని సైతం పరిశీలిస్తామని కమిషనర్ పేర్కొన్నారు. ఎక్కడ ఆక్రమణలున్నా తొలగిస్తామన్నారు.

సెలవుల్లో పాఠశాలలు నడిపితే చర్యలు

కోస్గి, అక్టోబరు 4 : దసరా సెలవుల్లో పాఠశాలలు నడిపితే చర్యలు తప్పవని మండల విద్యాధికారి శంకర్‌నాయక్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కోస్గి పట్టణంలో పలు ప్రైవేటు పాఠశాలలు సెలవుల్లో నడుపుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, నేటి నుంచి పూర్తి సమాచారాన్ని సేకరించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామన్నారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు కొండాపూర్ విద్యార్థులు


రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులు

ధన్వాడ, అక్టోబరు 4 : మండలంలోని కొండాపూర్ ఎస్సీ గురుకుల పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రాజారాం తెలిపారు. ఈ నెల ఐదు నుంచి ఏడో తేదీ వరకు ప్రకాష్ స్టేడియం కొత్తగూడెంలో జరగనున్న 68వ రాష్ట్ర స్థాయి పాఠశాల క్రీడా సమాఖ్య ఫుట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టు తరపున ఆడనున్నట్లు వివరించారు. పోటీలకు ఎంపికైన వెంకటేశ్, సిద్ధార్థ, చరణ్‌కుమార్‌లను ప్రిన్సిపాల్‌తో పాటు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ సాంబయ్యనాయక్, కోచ్ రాంమోహన్‌గౌడ్‌లు అభినందించారు.

దాతల సహకారంతో రేకుల షెడ్డు ఏర్పాటు


కృష్ణానది ఒడ్డున ఏర్పాటు చేసిన రేకులషెడ్డు

కృష్ణ, అక్టోబరు 4 : మండల కేంద్రంలోని కృష్ణానది ఒడ్డున దాతల సహకారంతో రేకుల షెడ్లు ఏర్పాటు చేశారు. కర్మకాండ, అస్థికలు నదిలో వేసేందుకు, నదిలో పుణ్య స్నానాలు చేసేందుకు వచ్చే మహిళా భక్తుల సౌకర్యార్థం వాటిని ఏర్పాటు చేసినట్లు దాతలు శేషుభట్, సురేష్‌భట్, నారాయణభట్‌లు తెలిపారు. దాదాపు రూ.30 వేలు వెచ్చించి షెడ్లు ఏర్పాటు చేసినట్లు వారు చెప్పారు. దాతలను యాత్రికులు, గ్రామస్థులు సన్మానించి, అభినందించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

దామరగిద్ద, అక్టోబరు 4 : మండల పరిధిలోని వత్తుగుండ్ల గ్రామంలో బీఆర్ఎస్ నాయకుడు గజలప్ప కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి పరామర్శించారు. రెండురోజుల క్రితం మృతిచెందిన గజలప్ప తల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబీకులకు సానుభూతి తెలిపారు. మాజీ ఎమ్మెల్యే వెంట పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ముదిరాజ్ మహాసభ జిల్లా కార్యదర్శిగా తమ్మప్ప

కృష్ణ, అక్టోబరు 4 : ముదిరాజ్ మహాసభ జిల్లా యూత్ కార్యదర్శిగా మండల కేంద్రానికి చెందిన తమ్మప్పను ఎంపిక చేశారు. ఈ మేరకు మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి చేతుల మీదుగా తమ్మప్పకు నియామక పత్రం అందించినట్లు ఆ సంఘం జిల్లా నాయకుడు గాసం నర్సింహ తెలిపారు. ముదిరాజ్‌ల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తమ్మప్ప పేర్కొన్నారు.

'ఫార్మాకు వ్యతిరేకంగా పాదయాత్ర'

కోస్గి, అక్టోబరు 4 : దుద్యాల మండలం హకీంపేట వద్ద ఫార్మా ఏర్పాటును వ్యతిరేకిస్తు ఈనెల తొమ్మిదో తేదీన కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పాదయాత్ర చేయనున్నారని నారాయణపేట గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రామకృష్ణ అన్నారు. శుక్రవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఫార్మా ఏర్పాటుతో భూములు కోల్పోతున్న రైతుల పక్షాన మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి తొమ్మిదో తేదీన ఉదయం పోలేపల్లి ఎల్లమ్మను దర్శించుకొని అక్కడ్నుంచి హకీంపేట, లగచర్ల మీదుగా కొడంగల్ వేంకటేశ్వర స్వామి ఆలయం వరకు 20 కిలోమీటర్లు పాదయాత్ర చేయనున్నట్లు వారు తెలిపారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు వెంకట్‌నర్సిములు, సాయప్ప ఉన్నారు.

'వర్గీకరణ అమలు చేయకుండా డీఎస్సీ ఫలితాలు విడుదల చేయొద్దు'

నారాయణపేట, అక్టోబరు 4 : సీఎం రేవంత్‌రెడ్డి వర్గీకరణ అమలు చేయకుండా డీఎస్సీ ఫలితాలు విడుదల తగదని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కర్రెప్ప, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు వెంకటయ్యలు అన్నారు. శుక్రవారం నారాయణపేట అంబేడ్కర్ కళాభవన్‌లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ అనుబంధ సంఘాల జిల్లా సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల తొమ్మిదో తేదీన డీఎస్సీ ఉద్యోగులకు నియామక పత్రాలు ఇచ్చే రోజున మాదిగల నల్ల జెండాల ప్రదర్శన చేసి నిరసన వ్యక్తం చేస్తామన్నారు. సీఎం మాదిగలను మోసం చేసేందుకు యత్నిస్తున్నారని విమర్శించారు. సమావేశంలో అశోక్, దినేష్, సంజీవ్, పరశురాము, ఆనంద్, సునిల్, హన్మంత్ రావు, వెంకటప్ప తదితరులున్నారు.

కోస్గి గ్రంథాలయాన్ని అభివృద్ధి చేయాలి

కోస్గి, అక్టోబరు 4 : కోస్గి గ్రంథాలయాన్ని అభివృద్ధి చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ విజయ్‌కుమార్‌కు పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు వీర మల్లేష్ వినతిపత్రం అందించారు. గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు అందుబాటులో ఉంచాలని ఆయన కోరారు.